# మచ్ ఎడో ఎబౌట్ నథింగ్

రాత్రి తొమ్మిదన్నరకి మొదటి ఆట సినిమా చూసి వస్తూండగా సన్నగా వానతుంపర మొదలయింది. అప్పటికే కొంచెం తడిసిపోయి. తల్జా భవన్ బస్ స్టాపు షెల్టరులో తల దాచు కుందుకు పరిగెట్టాను. అప్పుడే బస్సు వచ్చేటట్టు లేదు. జల్లు లోపలికి కొడు తోంది. కొంచెంగా చలిపెడుతోంది. ఎదురుగా 'టూరిస్టు హోటలు' పేరు ఎర్రగా మెరుస్తోంది. సిటీ బస్సులు హడావిడిగా రొదచేసుకుంటూ పోతు న్నాయి; కాని. నేను ఎక్కవలసిన బస్సు ఇంకా రాకపోయేసరికి నాకు చిరాకు మొదలయింది.

ఏమీ తోచక మిగతా జనంకేసి చూడడం మొదలెట్టాను. ఒక యువక జంట సరదాగా కబుర్లు చెప్పుకుంటు న్నారు. మరొక పక్క ముసలాయన ఒకడు చలిగాలికి వణుకుతూ ముడుచు కుని కూర్చున్నాడు. వీళ్ళుకాక మధ్యన ఒక నాలుగేళ్ళ చిన్న అమ్మాయి జోగుతూ కునికిపాట్లు పడుతూంది. నూనె రాసుకోని జుట్టూ, బురదలో ఆడుకుందేమో, మట్టిమరకలున్న పరి కిణీ - ఇదీ ఆ అమ్మాయి అవతారం. చూడగా చూడగా నాకు ఈ అమ్మాయి వీళ్ళెవరికీ సంబంధించినది కాదేమో అనిపించింది. ఇంత చిన్న పిల్లని వది లేసి తల్లి ఎక్కడికి పోయుంటుంది? బహుశా, అలా పక్కకి ఏపైనా వెళ్ళి ఉండవచ్చు వస్తుందేమోనని చూస్తూ నిల్చున్నాను.

పావుగంట గడిచిపోయింది. బస్సు రాలేదు. ఆ అమ్మాయి అక్కడే నిద్ర పోతూంది. అనుమానం వచ్చింది నాకు.... బహుశా, బస్సు ఎక్కే హడా విడిలో తప్పిపోయిందేమో. పక్కన ఉన్నాయన్ని అడిగాను - ఆయనకూడా తలూపి "నాకుకూడా అలాగే అనిపిస్తోం దండీ.... అరగంటనించీ చూస్తున్నాను. ఆ అమ్మాయి అలాగే ఉంది. కాని, ఎవరూ మాత్రం రాలేదు" అన్నాడు.

చూస్తూ చూస్తూ ఆ అమ్మాయిని అలా ఒంటరిగా వదిలివేయ బుద్ధి కాలేదు. పోనీ. ఒక పని చేద్దామని ఆ పిల్లని తట్టి లేపాను. లేచినట్టే లేచి మళ్ళీ జోగడం మొదలెట్టింది. "నీపేరే మిటి పాపా?" అన్నాను మళ్ళీ లేపుతూ. మాట్లాడకుండా నాకేసే తెల్ల బోయి చూడ్డం మొదలెట్టింది. తెలుగు తెలియదనుకున్నట్టున్నాడు నా పక్కా యన - కొంచెం విసుగ్గా మొహంపెట్టి "తుమ్‌హారా నామ్ క్యాహై?" అని అడిగాడు హిందీలో. ఆ అమ్మాయికి

---

రెండవ బహుమతి రూ. 25

వి. వి. సత్యనారాయణమూర్తి,

[బి. ఇ. (ఫైనల్) కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, ఉస్మానియా యూని వర్శిటీ, హైద్రాబాదు.]

భయం వేసిందిగాన్న, ఏడుపుమొహం పెట్టింది. ఏమడిగినా చెప్ప లేక పోతోంది.

చివరకి నాకు విసుగొచ్చి, పోలీసు రిపోర్టు యిద్దాం అన్నాను దగ్గరున్న వాళ్ళతో. వాళ్ళు ఇబ్బందిగా మొహం పెట్టి 'ఈలోపుగాబస్సువచ్చేస్తుందేమో' అంటూ నసిగారు. నాకు మా త ం ఆ పిల్లని అలా వదిలివేయడం యిష్టం లేక పోయింది. దగ్గరే ఉన్న కిళ్ళీకొట్టు అతనితో ఆ అమ్మాయిని చూస్తుండ మని చెప్పి కాఢిగూడా పోలీసు స్టేషనుకి బయలు దేరాను.

ఓ పావుగంట గడిచాక పోలీసుని వెంట బెట్టుకుని వెళ్ళిచూస్తే ఆ పిల్ల అక్కడ కనిపించలేదు. దానికితోడు ఆ ముసలాయన, యువక జంటకూడా లేకపోయే సరికి కంగారుగా కిళ్ళీకొట్ట తని దగ్గరకెళ్ళి, 'ఏమయిందాపిల్ల' అని అడిగాను ఆత్రంగా. అతను నవ్వుతూ "ఏమీ లేదండీ! ఆ అమ్మాయి యిల్లు ఆ వెనకాతలే ఉందట. బురదలో ఆడి, పరికిణీ మాపుకుందని ఆఅమ్మాయి తల్లి కోపం వచ్చికొట్టిందట. దాంతో అలిగి అన్నం తినకుండా యిక్కడ నీరసంగా నిద్రపోతూందిట వాళ్ళంతా కంగారుపడి వెదికితే ఇక్కడ కనిపిం చింది. ఇప్పుడే వచ్చి తీసి కెళ్ళి పోయారు" అన్నాడు.

ఇదంతా ఓపికగా విన్న పోలీసు నాకేసి కోపంగా చూస్తూ ఏదో గొణు క్కుంటూ వెళ్ళిపోయాడు.

నేవెళ్ళ వలసిన ఆఖరిబస్సు పది నిముషాల క్రితమే వెళ్ళిపోయింది (ట) ఈ అర్థంలేని హడావిడితో తనకేం పని లేదన్నట్లుగా.

***

---

★ ఒక ప్రసిద్ధ చలనచిత్ర తార :— "నేను సినిమాల్లో కొచ్చి పదేళ్ళయింది. ఇప్పటికి తెసులుకున్నాను నేను సినిమాలకి పనికిరానని."

పత్రికా విలేకరి :— "అయితే సినిమాలనుంచి తప్పుకుందామను కుంటున్నారా ?"

తార :— "ఊహూ. ఎలా తప్పుకోను ? నేనిప్పుడు ఇరవై నాలుగు సినిమాల్లో నటిస్తుంటే ?"